క్లుప్తంగా

ముక్తీశ్వరస్వామి భూముల కౌలు వేలం

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం ముక్తీశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిక్కుడు శ్రీనివాసులు తెలిపారు. మూడు సంవత్సరాల కాల పరిమితికి సంబంధించి దేవదాయశాఖ అధికారుల సమక్షంలో మోక్షగుండంలోని రామాలయం వద్ద వేలం పాట జరుగుతుందన్నారు. ప్రతి పాటదారు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పాట పూర్తి అయిన వెంటనే ఒక ఏడాది మక్తా ముందుగా చెల్లించాలని, పాత బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం, పెంచికలపాడు, నేకునాంబాద్, పూసలపాడు, పాపాయిపల్లె, గిద్దలూరు మండలంలోని సంగపేట, గుడిమెట్ట, మేడంవారిపల్లె గ్రామాల్లో దేవాలయ భూములకు వేలంపాట జరుగుతుందన్నారు.

విద్యుదాఘాతంతో కూలీకి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన నాగశేషు

కొమరోలు: కూలి పనులు చేసుకుంటున్న ఓ వ్యక్తికి విద్యుత్ తీగ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇడమకల్లులో శుక్రవారం జరిగింది. మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన ఎం.నాగశేషు అనే కూలీ గ్రామంలోని సత్రం వద్ద పని చేస్తున్న సమయంలో దగ్గరగా ఉన్న విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగలడంతో నాగశేషుకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మార్కాపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ వెంకటరత్నం

కొమరోలు: స్థానిక ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పాఠశాల రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని తెలిపారు.

మాతృత్వ వందన యోజన, సాధికారతపై అవగాహన



మాట్లాడుతన్న సీడీపీవో సుధా మారుతి

పొదిలి: ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, మహిళా సాధికారత, కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాదాలవారిపాలెంలోని రామాయణ ఖండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సుధామారుతి మాట్లాడుతూ మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త చట్టాల గురించి వివరించారు. పీఎంఎంవీవై, మహిళా సాధికారత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులైన వారికి అక్కడ అందచేస్తున్న పౌష్టికాహారం గురించి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ అవినాష్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఆదర్శంగా ఉండాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి

కొనకనమిట్ల: అంగన్‌వాడీ కేంద్రాలు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేసి పౌష్టికాహారాన్ని గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు సకాలంలో అందజేసి కేంద్రాలకు మంచి పేరు తీసుకరావాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్లగట్టు గ్రామంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం పలువురు గర్భిణులకు పౌష్టికాహార పదార్థాలు అందజేశారు.

నేడు తుమ్మలచెరువులో చిన్న షరగత్



దర్గాలో ఉంచిన పీర్లు



విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న దర్గా

- దర్గాలో కొలువుదీరిన పీర్లు
- కులమతాలకతీతంగా ప్రత్యేక ప్రార్థనలు

తర్లుపాడు: హజరత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరించుకుంటూ నిర్వహించే మొహర్రమ్ వేడుకల్లో భాగంగా నేడు తుమ్మలచెరువులో చిన్నషరగత్ నిర్వహించనున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను హిందు, ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా దర్గాలో కొలువైన పెద్ద ఖాశీం స్వామి, చిన్నఖాశీం స్వాములను భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకుంటారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. రోడ్లకు ఇరువైపులా చిల్లచెట్లను తొలగించారు. పీర్లగుండం తవ్వించారు. నేటి రాత్రి గుండం ప్రారంభమవుతుంది. తెల్లవారుజామున స్వామివారిని గ్రామంలో ఊరేగిస్తారు. ఇప్పటికే గ్రామంలో ఇళ్లన్నీ బంధువుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రత్యేక అలంకారంలో జగదాంబదేవి



ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు



శాకంబరిగా అమ్మవారు



పూజలందుకుంటున్న అమ్మవారు

మార్కాపురం: ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో వారాహి అమ్మవారి నవరాత్రుల్లో భాగంగా శ్రీ జగదాంబ దేవీ అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదాంబ అమ్మవారిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి పలు ప్రత్యేక పూజలు చేశారు. తమ కోర్కెలు తీర్చాలని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా అమ్మవారు

గిద్దలూరు రూరల్: ఆషాడమాసం వారాహి నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకంబరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి వివిధ కూరగాయలతో అలంకరించారు. అద్దాల మండపంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు అమ్మవారు శాకంబరి అమ్మవారిగా దర్శనమిచ్చిన కథాసారాంశాన్ని వివరించారు.

వైభవంగా కోటి కుంకుమార్చన పూజలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మి పద్మావతి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మండలం రోజులు సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో పూజలు శుక్రవారం నాటికి 21వ రోజుకు చేరాయి. ఉభయదాతలను ఆలయంలోకి ఆహ్వానించి, శాలువాలతో సత్కరిస్తున్నారు. వారిచే ప్రత్యేక పూజల చేయిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అనంతరం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీకృష్ణమాచార్యులు, కార్యక్రమం నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, పెరుమాళ్ళ భాస్కర్, మేడా నరసింహారావు, ఎస్.నాగేశ్వరరావు, మల్లయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం టౌన్: మార్కాపురం రూరల్‌లోని కోమటికుంట, తిప్పాయపాలెం, రాయవరం, గజ్జలకొండ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా వాటి పరిధిలోని వేములకోట, చింతగుంట్ల, తిప్పాయపాలెం, రాయవరం, ఎస్టేట్, గజ్జలకొండ తదితర గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు సబ్ ఇంజినీర్ సుబ్బరాయుడు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు తర్లుపాడులో విద్యుత్‌కు అంతరాయం

తర్లుపాడు: మరమ్మతుల కారణంగా తర్లుపాడు సబ్‌స్టేషన్ పరిధిలో నేటి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ హనుమానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. బేస్తవారిపేట, సోమవారిపేట, చింతలపాలెం, గొట్లమిండ్లు, నేకునాంబాద్, కలగొట్ల, చెట్టిచర్ల, ఒందుట్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన తిరుపతి

మార్కాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం ఉదయం జరిగింది. మార్కాపురం మార్కెట్ యార్డు సమీపంలోని పోలీసు ఔట్ చెక్ పోస్టు టీ జంక్షన్ వద్ద జరిగింది. బద్వీడు చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిట్యాల తిరుపతికి తలకు బలమైన గాయాలు కావడంతో హుటాహుటిన మార్కాపురం జీజీహెచ్‌కు తరలించడంతో చికిత్స పొందుతున్నాడు.

ఇంగ్లిషుపై పట్టు సాధించండి

మార్కాపురం రూరల్: విద్యార్థులు ఇంగ్లిషుపై పట్టుసాధించాలని ఎంపీడీవో తోట చందన సూచించారు. శుక్రవారం మండలంలోని తిప్పాయిపాలెం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి స్కూల్ రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని చక్కగా అమలుచేయాలని కోరారు. ఇంగ్లిషు భాషపై పట్టుసాధించాలని ఆమె విద్యార్థులకు తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



కౌలు గుర్తింపు కార్డు అందజేస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం, వెల్లుపల్లె, తిమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాలల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులను స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి అందజేశారు. సీసీఆర్సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి కౌలురైతును గుర్తించి కౌలుగుర్తింపు కార్డులు అందజేస్తున్నామన్నారు. మండలానికి 1461 మంది రైతులను గుర్తించి కౌలుగుర్తింపు కార్డులను అందజేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆ దిశగా రెవెన్యూ, వ్యవసాయశాఖకు చెందిన ప్రతి అధికారి పనిచేయాలని కోరారు. గుర్తింపు కార్డుల కాలపరిమితి 11 నెలలు మాత్రమేనన్నారు. భూయజమానులు కౌలు రైతులకు సహకరించాలన్నారు. కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఎటువంటి హక్కు ఉండదన్నారు. భూ యజమానులు భూమిని కౌలుకు ఇవ్వడంలో ఎటువంటి ఇబ్బంది లేదని గ్రహించాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, వ్యవసాయశాఖ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓలు, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



తర్లుపాడులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

తర్లుపాడు: మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం తర్లుపాడులో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ర్యాలీ, బస్టాండు సెంటరులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీ చంద్రశేఖర్, ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, మండల న్యాయసేవాధికారి బీ శ్రీనివాసులు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుధాకర్, ఏపీఎం పిచ్చయ్య, వెటర్నరీ అసిస్టెంటు రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి గోడౌన్‌ను డీఎస్పీ తనిఖీ



మందు గుండు సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని సలకనూతల, దొండ్లేరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న లైసెన్స్‌డ్ మందుగుండు సామగ్రి అమ్మే మణికంఠ ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్‌ను శుక్రవారం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ తనిఖీ చేశారు. అనంతరం స్టాక్‌కు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, రెడ్‌ఫ్లాగ్స్, వాటర్ ఫెసిలిటీ, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిర్వాహకులకు తెలియజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట పొదిలి సీఐ మల్లిఖార్జునరావు, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇడుపూరులో మొహర్రం వేడుకలు

మార్కాపురం రూరల్: మండలంలోని ఇడుపూరులో శనివారం నుంచి మొహర్రం (పీర్ల పండుగ) నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని దర్గాలో హజరత్ ఖాశీం స్వాములవారి దర్గాలో పీర్లు కొలువుదీరాయి. గ్రామంలోని ప్రజలందరూ కులమతాలకు అతీతంగా పండుగను జరుపుకుంటున్నారు. 5 రోజుల పాటు పీర్లపండుగను గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈనెల 13న చిన్న షరిగత్, 17న పెద్ద షరగత్, 18న షహదత్‌తో పీర్ల పండుగ ముగుస్తుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పీర్లపండుగకు ఈ గ్రామానికి వచ్చి మొక్కులు చెల్లిస్తారు.



కందిపప్పును అందిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు పంపిణీ

- ప్రారంభించిన సబ్‌కలెక్టర్

మార్కాపురం టౌన్: నిత్యావసర ధరల నియంత్రణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై బియ్యం, కందిపప్పు పంపిణీని ప్రారంభించినట్లు సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. పట్టణంలోని కొత్తమార్కెట్ ప్రాంతంలో శుక్రవారం ఆయన సబ్సిడీపై అందించే బియ్యం, కందిపప్పు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులైన కందిపప్పు, బియ్యంలను తగ్గించి ప్రజలకు విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇందులో భాగంగా కందిపప్పు కిలో రూ.160, బియ్యం ఒక రకం రూ.49, మరో రకం రూ.48 విక్రయించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కిరణ్, పలువురు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలు ప్రారంభం

పొదిలి: రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని చిన్న బస్టాండ్‌లోని హరిహర పుత్ర డాల్‌మిల్‌లో శుక్రవారం ప్రారంభించారు. పొదిలి డాల్ మిల్ అసోసియేషన్, రైస్ హోల్ సేల్ దుకాణాల వారి సహకారంతో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గునుపూడి భాస్కర్, డీటీ రామనారాయణరెడ్డి, ఏఎస్‌ఓ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, మాజీ ఉపసర్పంచ్ షేక్.జిలానీ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం తొలగింపునకు చర్యలు



పెచ్చులూడిన భవనాన్ని పరిశీలిస్తున్న డీసీవో

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలోని ఓ గది శిథిలావస్థకు చేరటంతో దానిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీవో జయ, ఈఈ భాస్కర్‌బాబు అన్నారు. శుక్రవారం వారు వెలుగొండలోని గురుకుల పాఠశాలను పరిశీలించారు. అక్కడ ఓ భవనం శిథిలావస్థకు చేరటంతో వారు దాన్ని పరిశీలించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని డీసీవో జయ అన్నారు. గురుకుల పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు.

పొగాకు ధరలు ఇలానే ఉంటాయనుకోవద్దు



మాట్లాడుతున్న ఏఎస్ గిరిరాజ్‌కుమార్

పొదిలి: పొగాకు ధరలు భవిష్యత్‌లో కూడా ఇలాగే ఉంటాయనుకోవద్దని, అంతర్జాతీయ పరిణామాలు మారితే ధరలు కూడా మారతాయని పొగాకు వేలం అధికారి గిరిరాజ్‌కుమార్ చెప్పారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. గిరిరాజ్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిస్థితులు, ఆయా దేశాల్లోని పొగాకు ఉత్పత్తి, ఇతర అంశాలపై ధరలు ఆధారపడి ఉంటాయని చెప్పారు. ఇదే ధరలు ఉంటాయని రైతులు భావించి అధిక మొత్తంలో బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేస్తే తప్పని సరిగా పొగాకు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బోర్డు అనుమతి లేకుండా పొగాకు బ్యారన్‌లు నిర్మిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని వారికి ఉన్న లైసెన్సులు కూడా రద్దు చేస్తారన్నారు. బోర్డు సూచించిన మేరకు మాత్రమే పొగాకు సాగు చేపట్టాలన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఇతర లాభసాటి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. లోతట్టు, పల్లపు ప్రాంతాల్లో పొగాకు సాగు చేయవద్దని కోరారు. రైతులు ఉత్తమమైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ విస్తీర్ణంలో నాణ్యమైన అధిక పొగాకును ఉత్పత్తి చేయాలన్నారు. భూసారాన్ని పెంపొందించుకునేందుకు రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ల పైర్లను సాగు చేయాలన్నారు. అదును దాటిన తరువాత చేపట్టే సాగులో మల్లె ఏర్పడి, లోగ్రేడ్ పొగాకు వచ్చి రైతులు నష్టపోతారన్నారు.

కౌలు రైతులకు కౌలుకార్డులివ్వాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు

అర్థవీడు (బేస్తవారిపేట): కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు కార్డులపై వీఆర్‌ఏలు, వీఏఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీఆర్సీ కార్డు పొందడంతోనే ప్రభుత్వం కల్పించే పథకాలు వర్తిస్తాయని తెలిపారు. వ్యవసాయాధికారి షేక్ మహ్మద్, వీఏఏ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కొమరోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు కామూరి అమూల్య తెలిపారు. మండలంలోని బొడ్డువానిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్టూడెంట్స్ కిట్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ కామూరి అమూల్య పాల్గొని విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందజేశారు. ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించి విద్యను అందించాలన్నారు. ఎంఈఓలు కె.వెంకటేశ్వర్లు, బి.వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అమూల్య